"నన్ను గుర్తు పట్టారా? అదివరకోసారి వచ్చాను"

"ఎస్! ఐ డోన్ట్ ఫర్ గెట్ పీపుల్"

"అది అవసరం, ఏమిటి ప్రాబ్లమ్?"

"అదే నేచర్స్ గిఫ్ట్ ఈమెతో మాట్లాడండి" నవ్వుతూ అన్నాడు

"దాటి ఎన్ని రోజులయింది?"

"మూడు వారాలు"

"ఓ! మరిన్ని రోజులూ?"

"కన్‌ఫర్మేషన్ కోసం టాబ్‌లెట్స్ వేసుకున్నాను. కన్‌ఫర్మ్ అయింది"

"కావాలనుకుంటున్నారా, వద్దనుకుంటున్నారా?"

"వద్దని"

"ఆ.......ఎస్........ మొదటిది"

"మరెందుకు వద్దనుకుంటున్నారు?"

"ఎందుకంటే....అదే ఇంకా బాగా ఎంజాయ్ చేయాలని"

"ఎంత కాలమయింది మారేజ్ అయి?"

"జస్ట్ వన్ ఇయర్"

"ఓ, కానీ మాట్లాడితే డాక్టర్స్ దగ్గరకు రాకుండా వేరే పద్ధతులున్నాయ్. ఉపయోగించండి"

"ఉపయోగిస్తున్నాం. కానీ 'లీక్' వుండడం వల్ల......"

"నిజమే! ఇలా చాలా కంప్లయింట్స్ వస్తున్నాయి.....లీక్ ప్రూఫ్ తయారుచేయాలి"

"ఎస్ డాక్టర్! దిసీజ్ హై టైమ్. లేకపోతే లీక్ పాప్యులేషన్ ఎక్కువయిపోతుంది"

"కమ్ విత్ మీ"

నటాషాను కర్టెన్ వెనుకకు తీసుకెళ్ళిందామె

రెండు నిమిషాల తర్వాత ఇద్దరూ తిరిగి వచ్చారు.

"ఎల్లుండి ఉదయం సుష్మా నర్సింగ్ హోమ్‌కి రండి, ఛార్జ్ తెలుసుగా వన్ థౌజెండ్"

"మెటీరియల్ మంచిది కానందుకు ఫైన్ మాకు" నవ్వుతూ అన్నాడు.

"దటీజ్ హౌ ది వరల్డ్ ఈజ్-"

"ఎస్ దటీజ్ హౌ మెటీరియల్ ఈజ్-"

ఇద్దరూ హోటల్ కొచ్చేశారు.

"మనల్ని భార్యభర్తలనుకుంటోంది" నవ్వాపుకుంటూ చెప్పింది నటాషా.

"కాదని తెలిస్తే ఫీజ్ ఎక్కువ లాగేస్తుంది. అసలెలా జరిగిందది?"

"నేను చాలా కేర్‌ఫుల్‌గానే వుంటాను. అయినా ఒకోసారి డ్రింక్స్ మత్తులో....."

"పాజిబుల్"

"ఎస్!" నటాషా హఠాత్తుగ అతని పెదాలమీద ముద్దు పెట్టుకుంది. రాజ్యలక్ష్మి తలుపు తెరుచుకుని లోపలకొస్తూ ఇద్దరినీ చూచి 'సారీ' అంది.

"నెవర్ మైండ్ అయ్ లైక్ అడియన్స్" అన్నాడు అతను. రాజ్యలక్ష్మి నవ్వేసింది.

"మీరూ ప్రాబ్లమ్‌తో వచ్చారా?" అడిగాడు.

"నో ప్రాబ్లమ్స్! నేనిక్కడే కొంతకాలం కంట్రాక్ట్."

"ఏ హోటల్?"

"హరి ఇంటర్నేషనల్"

"ఓసారి మీ షో చూడాలి"

"వెల్‌కమ్"

"అన్నిటికీనా?"

ఆమె చిలిపిగా చూసి నవ్వింది.

"నో -ఓన్ లీ కాబరే షో"

అతను లేచి నిలబడ్డాడు.

"ఎల్లుండి వస్తాను. ఎనిమిదికల్లా రడీగా వుండు" చెప్పాడు నటాషాతో. బయటకి వస్తుంటే రాజ్యలక్ష్మి అతని వెనకే వచ్చింది.

"నటాషా లేకపోయినా రావచ్చు ఇక్కడికి"

"ఓ! ది డోర్ ఈజ్ ఓపెన్?"

"ఫర్ యూ ఓన్‌లీ"

*　　*　　*　　*

తులసి కిటికీ దగ్గర కూర్చుని చదువుకుంటోంది.

అమాంతం ఆమెను లేవనెత్తి గుండెలకు హత్తుకున్నాడతను.

"ఏమిటిది?"

"లవ్ విత్ స్ట్రేంజర్. కొత్త పిక్చర్"

ఆమె పెనుగులాడసాగింది.

"తలుపు తెరిచే వుంది. యూ ఇడియట్"

అతను వినిపించుకోవటంలేదు.

"అయ్యో చెబుతుంటే వినిపించుకోవేం?"

మరికొద్ది సేపట్లో ఆమె పెనుగులాట ఆగిపోయింది.

ఇద్దరూ స్వర్గదారాల్లో కెళ్తున్నప్పుడు కాపలావాడు అడ్డు పడ్డాడు.

"ఓ!" నమ్మలేని నిజాల్లో ఎవరిదో గొంతు.

అతను అయిష్టంగానే కళ్ళు తెరచి చూశాడు.

కాపలావాడు కాదు.

గంగాభవాని!

మొహం ఎర్రగా అయి, సిగ్గుతో నిండిపోయి వెనక్కు తిరిగి పరిగెడుతూ.

తులసి ఒక్క తోపు తోసి లేచి కూర్చుంది.

"హలో మేడమ్! రండి టూ బై త్రీ చేసుకుందాం..... అదే టీ" తలుపు దగ్గరకెళ్ళి గంగాభవానిని పిలిచాడు.

ఆమె ఇంట్లోకి వెళ్ళి తలుపు మూసేసుకుంది.

"యూ ఆర్ రియల్లీ మాడ్" అంది తులసి కోపంగా.

"మాడ్ ఆఫ్టర్ యూ"

"సెక్స్ మానియాక్"

"బికాజ్ ఆఫ్ యూ"

కొద్ది సేపు నిశ్శబ్దంగా గడిచింది.

"వచ్చే ఫస్టునుంచీ నా ఉద్యోగం పోతోంది"

ప్రక్కనే బాంబ్ పడినట్లు అదిరిపడ్డాడు.

"పోతుందా?"

"అవును"

"ఎందుకని?"

"చెప్పాను కదా! మనం సంసారం చేస్తున్నట్లు తెలిసిపోయింది మా బాస్‌కి."

"మనం విడివిడిగా పడుకుంటున్న ఫోటో తెచ్చిస్తానని చెప్పకపోయావా?"

"వాళ్ళందరూ కలసి కోర్టులో వేస్తున్నారు. అంతవరకూ యింకో ఉద్యోగం చూసుకోక తప్పదు"

సురేష్ నీరస పడిపోయాడు.

డార్క్ డెవిల్ గది తలుపు తెరిచే వుంది. సురేష్‌ని చూడగానే అతని మొహంలో ఆనందం నాట్యం చేసింది. "కమాన్!......కమాన్!......కమాన్!....... డియర్! లాంగ్ లాంగ్ టైమ్"

డార్క్ డెవిల్ ఎదురుగ్గా టీపాయ్ మీద రెండు విస్కీ బాటిల్సూ సోడాలు, పూర్తి చికెన్, రొట్టెలు సిద్ధంగా వున్నాయి. రెండు గ్లాసులు తీసుకొచ్చి టీపాయ్ కెదురుగ్గా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"ఇన్ - టైమ్ ఫెలో! మూ ఆర్ ఇన్ టైమ్! కమాన్!   లెటజ్ ఎటాక్! వన్ - టూ - త్రీ..."

"ఆగాగు" విస్కీ గ్లాసుల్లోకి వంచకుండా ఆపాడు సురేష్ "ఏమిటిదంతా? చికెన్, రొట్టెలు నువ్ తిండి తింటూండగా చూసి చాలా సంవత్సరాలయింది."

"సెలబ్రేషన్! కమాన్ లెటజ్ సెలబ్రేట్! క్విక్! ముహూర్తం దాటిపోతుంది" రెండు గ్లాసుల్లో సగానికి విస్కీ వంచేశాడు.

"ప్లీజ్ ! నాకొద్దు"

"షటప్! డార్క్ డెవిల్‌గాడు ఎవరికి డ్రింక్ ఆఫర్ చేయడు. ఒక వేళ చేస్తే ఎవడూ వద్దనడానికి వీల్లేదు. కాలేజ్ హాస్టల్లో మందు రెఫ్యూజ్ చేసినందుకు విశ్వనాథరెడ్డిని ఏం చేశాను? స్మాష్? ఒక పన్ను విరిగిపోయింది. గుర్తులేదూ?"

"ఉంది"

"అయితే నోర్మూసుకు తాగు" అంటూ ఓ గ్లాసు బలవంతంగా అతని చేతిలో వుంచాడు.

"కానీ సంగతేమిటో చెప్పలేదు. సెలబ్రేషన్ ఎందుకు?"

డార్క్ డెవిల్ కళ్ళలో ఆనందం మెరిసిపోయింది.

"ఇవాళ సగం యుద్ధం గెలిచాన్రా! హాఫ్ ది బ్యాటిల్ ఈజ్ వోన్"

"అంటే?"   డార్క్ డెవిల్ సగం గ్లాసు ఖాళీ చేసి లేచి తూలుకుంటూ వెళ్ళి అల్మారాలోంచి ఆ రోజు న్యూస్ పేపర్ తెచ్చి సురేష్ కిచ్చాడు.

"ఇదిగో! ఈ ఫోటో చూడు"   ఓ ముసలతని ఫోటో అది. సూటూ, టై-ఖరీదయిన వేషంలో వున్నాడు. సురేష్ దానికింద వున్న న్యూస్ ఐటమ్ చదివాడు త్వరత్వరగా.

"కారు ప్రమాదంలో నగర ప్రముఖుని మృతి" అని వుంది హెడ్డింగ్.

"కోటీశ్వరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ మార్కండేయులు నేటి రాత్రి నగరం శివార్ల నుంచి తమ కారులో వస్తుండగా లారీ ఢీ కొనడం వల్ల అక్కడికక్కడే మరణించారు. కారు డ్రైవర్ పరిస్థితి ప్రమాదకరంగా వుంది. లారీ తాకిడికి కారు పూర్తిగా ధ్వంసమై పోయింది. లారీ డ్రైవర్ పోలీసులకు లొంగిపోయాడు. శ్రీ మార్కండేయులు గారికి ఒక కొడుకున్నాడు."

సురేష్‌కేమీ అర్థంకాలేదు   "ఈ ఫోటోలో అతను ఎవరు?"

"మా పెదనాన్న"   సురేష్ ఉలిక్కిపడ్డాడు.

"మీ పెదనాన్న....."

"ఎస్ సేమ్ బాస్టర్డ్! మా ఆస్తి కాజేసి సుఖంగా జీవితం గడుపుదామనుకున్నాడు.

సురేష్ కేదో చటుక్కున గుర్తుకొచ్చింది   "అంటే......"

"అవును, బాంబే గ్యాంగ్ లక్షరూపాయలు ఇచ్చిన వారం రోజుల్లో వాడిని స్మాష్ చేసేశారు. బాడ్‌లక్ ఏమిటంటే వాడి కొడుకు కార్లో లేకపోవటం. అందుకే సగం యుద్ధం

గెలిచానన్నాను. ఇప్పుడు ఆ సగం మిగిలి వుంది."

"అతన్ని కూడా చంపేస్తారా?"

"ష్! చంపటం అనేది వాళ్ళ డిక్షనరీలో లేదు. జస్ట్ యాక్సిడెంట్ - అంతే! ఇంకో లారీ యాక్సిడెంట్, లేదా కారు లోయలోకి పడిపోవటం, లేదా పొరపాటున ఎనిమిదో అంతస్తు నుంచి కిందపడటం. అంతే! నెవర్ ఎ మర్డర్. కమాన్ డ్రింక్ ఫర్ ది హెల్త్ ఆఫ్ ఓల్డ్ బాస్టర్డ్" మిగతా గ్లాసు ఖాళీ చేసేశాడు.

"ఒరేయ్! నువ్వు నిజంగా డెవిల్‌వేరా"

డార్క్ డెవిల్ చేతిల్లోని గ్లాసు విసిరి గోడకేసి కొట్టాడు. ముక్కలు ముక్కలై పోయింది. "యస్ మా ఫ్యామిలీని అన్యాయం చేసిన ఆ డాగ్స్‌కి నేను నిజంగా డెవిల్" ఆవేశంగా అరిచాడతను.

సురేష్ ఇంకో గ్లాసు తెచ్చిచ్చాడు,

"బాస్టర్డ్! మా నాన్నగారు వాడిమీద జాలి పడి పుట్ పాత్ మీదున్న వాడిని తీసుకొచ్చి బిజినెస్‌లో పెట్టి సగం ఆస్తి ఇచ్చినందుకు మాకే ద్రోహం చేస్తాడా? ఒరేయ్ సురేష్ ! అసలు మా ఫాదర్‌కి హార్టెటాక్ ఎందుకొచ్చిందో తెలుసా? వాడు చేసిన ద్రోహం కనిపెట్టడం చేత " హఠాత్తుగా డార్క్‌డెవిల్‌లో ఆవేశం తగ్గిపోయింది. గొంతు గద్గదమైంది. కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినాయి.

"సురేష్! మా మమ్మీ ఎందుకు చనిపోయిందో తెలుసట్రా? పూలు అమ్మినచోట కట్టెలమ్మలేక. కోటీశ్వరుడయిన తన కొడుకు తెల్లారేసరికల్లా పుట్‌పాత్ మీద నిలబడటం చూడలేక. అందుకే ఆత్మహత్య చేసుకుందిరా"

సురేష్ అతని భుజం తట్టాడు ప్రేమగా.

"టేకిట్ ఈజీ"

అతని చేతిని విదిలించికొట్టాడు డార్క్‌డెవిల్.

"ఏమిట్రా! నాకు ఫ్యామిలీని సర్వనాశనం చేస్తే టేకిట్ ఈజీయా? నెవర్ ! వాళ్ళు చేసిన పాపానికి ప్రతిఫలం యిక్కడే అనుభవించాలి. కమాన్ ! లెటజ్ సెలబ్రేట్ ఓల్డ్ బాస్టర్డ్ డెత్."

ఇద్దరి గ్లాసులూ మళ్ళీ పుల్ అయ్యాయి.

"ఇంకొద్దురా తులసి...."

"లెట్ హర్ గో టూ హెల్ ! నీ ఫ్రెండ్ కంటే బ్లడీ తులసి ఎక్కువై పోయిందా ? కమాన్ ! డ్రింక్"

సురేష్ మాట్లాడకుండా తాగాడు. డార్క్‌డెవిల్ గ్లాసు ఖాళీచేసి మంచం మీద

వాలిపోయాడు.

"ఓ హసీనా! జుల్ఫోంవాలీ జానే జహా........."

పాట ప్రారంభమై పోయింది.

సురేష్ బలవంతం మీద గ్లాస్ ఖాళీ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

శరీరమంతా ఎక్కడో తేలిపోతోంది. కళ్ళు మూసుకుపోతున్నాయ్. మనసు తూలుతూ ఎక్కడెక్కడో విహరిస్తోంది.

ఇంతగా ఎప్పుడూ తాగలేదు . ఇదే ఫస్ట్ టైమ్.

హఠాత్తుగా కోపం ముంచుకొచ్చింది సురేష్‌కి. తనను ఎన్నయినా తిట్టవచ్చు వాడు. ఫుల్‌పవర్స్ వున్నాయ్ వాడికి తన మీద. కానీ తులసి మీద ఎవడికీ అధికారం వుండటానికి వీల్లేదు. తులసి తన సొంతం . తన సొంత స్పెషల్ ప్రాపర్టీ.

లేచి నిలబడ్డాడు, అడుగులు తడబడుతున్నాయ్. తూలుతూ వెళ్ళి మంచం దగ్గర నిలబడ్డాడు. "ఏమిట్రా తులసి నన్నావ్? బ్లడీ తులసా? బాస్టర్డ్ డార్క్ డెవిల్" పట్టుకుని మంచం మీద నుంచి లేవదీశాడు.